


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## సాధారణ బహుమతి పొందిన నవల

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

సంధ్య నాన్న మునిశేఖరం, సావిత్రమ్మకు పెదనాన్న కొడుకు. అతనికి అతని భార్యకు కూడా సంధ్యను రుద్ర కిచ్చి పెళ్లిచేయాలని కోరిక. కాని సావిత్రమ్మ ఎంకట్రెడ్డిల మనసులో ఏముందో తెలియక తామే ముందు హెచ్చరిస్తే బాగుండదేమోనని ఒక రోజు ఆమె ఎంకట్రెడ్డి ఇంటికి పనిగట్టుకొని వచ్చి ఆమాట ఈ మాట మాట్లాడి. సంధ్యకు సంబంధాలు చూస్తున్నామని ఆ ఏడు ఎటు తిరిగి పెళ్లి చేయాలనుకొంటుండాం అని సావిత్రమ్మ చెవిలో వేసిపోయింది సావిత్రమ్మకు. సంధ్య అంటే సావిత్రమ్మకు ఇష్టమే. సంధ్య రుద్ర అంటే ఇష్టపడుతుండటంతో పాటు ఎక్కడో కొత్త సంబంధం తెచ్చుకొనేకన్నా కళ్లెదురుగా ఉన్న పిల్లను ఇంటికోడలుగా చేసుకొంటే బాగుంటుందనుకొంది. అనుకొన్నదే తడవుగా ఉదయం టిఫిన్ చేసే సమయంలో ఎంకట్రెడ్డి దగ్గర మెల్లగా లేవనెత్తింది రుద్ర పెళ్లి విషయం. " అప్పుడే వాడికి పెళ్లెందుకే వోడి కాళ్లమీద వోడు నిలబడని "అని కొట్టేసాడు ఎంకట్రెడ్డి. "వోడి కాళ్ల మీదకాంగా నీ కాళ్ల మీద నిలబడినాడేంది. పెళ్లీడు వచ్చినాది. రేపో మాపో ఉద్యోగమెస్తాది. ఇంకెప్పుడు పెళ్లి సేస్తావు ముసలోడైనాకనా మీ అమ్మ ముని మనవడ్నో మనమరాల్నో ఎత్తుకొవాలని ఆసపడ్తాండాది. ఆమె ఆస తీర్సినట్టుంటాది "అని అమ్మ సెటిమెంటు జతచేసింది. సావిత్రమ్మ మాట కాదనలేక "సరేలే అలాగే కాని మంచి సంబంధం దొరకని. " అన్నాడు. దాంతో సావిత్రమ్మ సంతోషంతో " దొరక్కేమి నిన్న మనింటికి మా మునిశేఖరం ఆయన పెళ్లాం వచ్చింద్రు " అంటూ సావిత్రమ్మ చెప్పబోతుంటే ఉన్నట్లుండి టాపిక్ మార్చేసరికి ఆమె వంక అయోమయంగా చూస్తూ .

"బాగానే ఉండారు కందా ...ఏదన్నా పని పడితేగాని రారు ... ఏమైందంటా " అన్నాడు.

సావిత్రమ్మ మొగుడి వంక అదోలా చూస్తూ "సంధ్యకు పెళ్లి సంబంధాలొస్తుండాయంట. ఈ ఏడే పెళ్లి సేయలనుకొంటుడాడని సెప్పిందు".

" మంచిందే కందా ఈడొచ్చిన పిల్లకు పెళ్లి సేసేస్తే ఓ బరువుతీరినట్టుంటాది... "

అదే సమయంలో రుద్రకిష్టమని రవ్వ ఇడ్లీలు తీసుకొని వచ్చి లోపలికి రాబోతున్న సంధ్య వాళ్లిద్దరు తన పెళ్లి మాటలు మాట్లాడుతుంటే వాళ్లకు కనపడకుండా తలుపు చాటున ఉండిపోయింది వాళ్ల మాటలు వింటూ.

“ అది వచ్చినేది వోళ్లు సేసేది మంచో సెడ్డో సెప్పమని నిన్ననన్ను అడగడానికి రాలే ..సందెను మన కోడలిగా సేసుకొమని నేరుగా అడగలేక డొంక తిరుగుడుగా సెప్పేదానికి వచ్చింది మనమేమంటామో నని “ అంది. తెలిసి మాట్లాడుతున్నాడో లేక తనను ఆట పట్టించేందుకు మాట్లాడుతున్నాడో అర్థం కాక.

“ మీ ఆడోళ్లంతా అంతేనా నేరుగా సెప్పకుండా . ఆడొంక తిరుగుడెందుకు. “

“మనకిష్టమో లేందో తెలియందే ఎట్టా అడిగి కాదనిపించుకొంటరు. రుద్ర ఇంట్లోనే ఉండాడు పిలిపించి అడిగేతే వాడిష్టపడితే వోళ్లకు చెప్పొచ్చు ఓ పనైపోతాది“ అంది సావిత్రమ్మ. భార్య వదిలి పెట్టేలా లేదని

“నువేమంటావమ్మ “అన్నాడు అక్కడే కూర్చొని వక్కాకు దంచుకొంటున్న తల్లితో ఎంక్రటెడ్డి.

“ఈడు జోడు బాగుంటది .వోళ్లు ఒకర్నొకరు ఇట్టపడితే సాలు. పిలు రుద్రకు ఇట్టమో కాదా అడగండి వోడేమంటాడో “. అంది ముసలామె. ఎంకట్రెడ్డి ఎక్కడ మనసు మార్చుకొంటాడో అని సావిత్రమ్మ రుద్ర నుకేకేసింది. వాకిలి చాటున దాక్కున్న సంధ్యకు ఊపిరాడటం లేదు. రుద్ర నోట ఏమాట వినాల్సి వస్తుందో నని .

రుద్ర రాగానే సావిత్రమ్మే అడిగింది. “నీకు పెళ్లి సేయాలనుకొంటుండాం నీ మనుసులోన ఎవరన్న ఉంటేసెప్పు“ అంది. ఉన్నట్లుండి అలా పిలిచి అలా అడిగే సరికి వాళ్లంతా కూర్చుని ఓ నిర్ణయానికి వచ్చి తనను అడుగుతున్నారని అనుకొన్నాడు రుద్ర.

“అదేంది నా పెళ్లిమీద పడింద్రు. నాకిప్పుడే పెళ్లి సేసుకోవాలని లేదు. ఇంకా నాల్గైదేండ్లు పోవాలా . ఇంకా సేసే పనులు సానా లుండాయి. “

“పనులుండనే ఉంటాయిలే, నీకు పనులుండాయని వాళ్లు యాడ ఎదురు సూస్తు కూకుంటారు.మునిమామ కూతురికి పెళ్లి సంబంధాలు సూస్తుండామని మాట వరసకు సెప్పను వచ్చింది మీ మేనత్త. వోళ్ల మనసులోన నువ్వుండావు . నీ మనసులోన మాట సెపేతే పనైపోతాది. ఒకనెల అటో ఇటో మూర్తాలు పెట్టుకోవచ్చు. “ అంది సావిత్రమ్మ ఏమి నాన్చకుండా.

“నా కిప్పుడే పెళ్లి వద్దమ్మా . నా కోసరం వాళ్లు ఎదురు సూడటమేలా మంచి సంబంధమొస్తే సేయమను సెప్పు వోళ్లు ఊరికే మనమీద ఆసలు పెట్టుకోకుండా “అన్నాడు రుద్ర. సావిత్రమ్మ రుద్ర మాటలకు ఆశ్చర్యపోయింది. రుద్రకూడ సంధ్య అంటే ఇష్టపడుతున్నాడనుకొంది.ఈలా రుద్ర అంటాడని ఊహించలేదు.

“అదేందిరా సూచ్చంగా అంత మాటనేసినవు . అది నువంటే పడిసస్తాండాది. “

“సంధ్య నా మీద ఆసలు పెంచుకొనేటట్టు నేనెన్నడు నడుచుకోలే. ఎప్పుడు సనువుగా మాటాడింది లేదు. ఇంగా మనమీద ఆసలు పెట్టుకొకుండా ఈసారి వొచ్చినప్పుడు నువ్వు సెప్పేసేయి “ అన్నాడు.

సావిత్రమ్మ ఏదో అనబోతుండగా ఇక తలుపు చాటున ఉండలేక తడబడే అడుగుల్తో లోపలకి వచ్చిన సంధ్య ఆమె చేతికి టిఫెన్ బాక్స్ ఇచ్చి వెనక్కి వెళ్లపోతుంటే ఒక్కసారిగా అక్కడ నిశబ్దమేర్పడింది. బొట బొటా కారుతున్న కన్నీళ్లతో ఉన్న సంధ్యను ముఖాన్ని చూడటంతో అప్రయత్నంగా సావిత్రమ్మ కంట్లో నీళ్లు తిరిగాయి . ఉన్నట్లుండి వచ్చిన సంధ్యను చూసి విస్తుపోయాడు ఎంకట్రెడ్డి . సంధ్య కంట్లో నీళ్లను చూచి రుద్రకు జాలేసింది. ఎంకట్రెడ్డి పిలుస్తున్నా వెళ్లిపోతున్న సంధ్యను వేగంగా బైటికి వెళ్లి ఆపాడు రుద్ర. రుద్ర పిలుపుతో ఆగి పోయిన సంధ్య , తన దగ్గరగా వచ్చిన రుద్రను వెక్కిళ్లు పెట్టి ఏడుస్తూ గట్టిగా హత్తుకొంది . ఆమె కన్నీళ్లతో రుద్ర షర్టు తడిసిపోయింది. తను మాట్లిడితే మరింత ఏడుస్తుదని కొద్దిసేపు సంధ్యను అలాగే ఎడ్వనిచ్చాడు. కొద్దిసేపటకి దుఃఖంల్లోంచి తేరుకొన్న సంధ్య రుద్రకు దూరంగా జరిగింది. అక్కడే ఉన్న కుర్చీమీద కూర్చోమని చెప్పి తను కూర్చున్నాడు. కళ్లముందు సంధ్య ఉన్నా మనసులోపల నిర్మల రూపం మెదుల్తుండగా,

“సంధ్య నువ్వు నన్ను ఇష్టపడుతున్నావ్ కాని నేను నిన్నెప్పుడు ఆ దృష్టితో చూడలే. అలాగని నీ మీద ప్రేమ అభిమానం లేదని కాదు. అది వేరు ఇది వేరు. నువ్వు బాధ పడుతున్నావని నిన్ను నేను పెళ్లిచేసుకొంటే అది ప్రేమతో కాదు జాలితో చేసుకొన్నట్టే అవుతాది గాని ఇష్టంతో గాదు. ఒక్క విషయం గుర్తుపెట్టుకో సంధ్య , నువ్వు ప్రేమించే వోడ్ని పెళ్లి చేసుకొవడం కన్నా నిన్ను ప్రేమించే వోడ్ని ఇష్టపడే వాన్ని చేసుకోవడం వల్ల నీ జీవితం బాగుంటాది. నీకు అందం ఉంది తెలివి తేటలున్నాయ్ ఒక్కగా నొక్క కూతురువి. మంచి సంబంధం నిన్ను ఇష్టపడేవాడి సంబంధం వస్తుంది. బాధ పడటం మాని నేను చెప్పేది బాగా ఆలోచించు. “

కొద్దిసేపు అలాగే కుర్చున్న సంధ్య వెళ్లిపోయింది మౌనంగా.

సంధ్యతో తన మనసులోని మాట చెప్పాక నిర్మల పదే పదే గుర్తుకు రాసాగింది రుద్రకు. పరమేశం సస్పెండు కాక ముందు అప్పుడప్పుడు ఫోన్లో మాట్లాడేది. సస్పెండు అయ్యాక ఒక్క సారికూడా మాట్లాడనేలేదు. ఒకటి రెండు సార్లు ఆమెకు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో ఫోన్ చేయడం మానుకొన్నాడు రుద్ర ఒక సారి వెళ్లి ఆమెను ఆమెతోపాటు పరమేశాన్ని చూచినట్లగా ఉంటుదనుకొంటూ . తను వెళ్లడం గురించి చెప్పగానే పూజారి బికారి కూడా వస్తామనడంతో పరమేశానికి ఫోన్చేసాడు రుద్ర . పరమేశం తను ఇంటి దగ్గరే ఉన్నానని భార్య కొడుకులేరని , నిర్మల ఆఫీసులో ఉందని తప్పకుండా రమ్మనమని తమ అడ్రసు చెప్పాడు.

ముగ్గురు బయలు దేరారు. పరమేశం ఇంటికి పోకముందే నిర్మలను ఆఫీసుదగ్గర కలవాలనుకొని ఆఫీసు దగ్గరికి వెళ్లారు వాళ్లు.ఆఫీసు దగ్గర గుంపులు గుంపులు గా జనాలు చేతిలో కాగితాలు పట్టుకొని తోసుకొంటూ ఆఫీసులోపలికి పోవాలని ప్రయత్నం చేస్తుంటే పోలీసులు వాళ్లను లోపలికి పోనీకుండా ఆపుతున్నారు. ఎక్కువ మంది పాతికేళ్లు పైబడిన వాళ్లే ఉన్నారు. ముఖ్యంగా ముసలివాళ్లు ఎక్కువగా కనిపించారు. ఆఫీసు ఎదురుగానే ఏదో గుడారం

వేసి అర్ధనగ్నంగా కూర్చున్నారు కొంత మంది ..ఎక్కడ చూచినా ఇంతేనా పరిస్థితి అనిపించింది రుద్ర వాళ్లుకు. ఇక్కడా అబ్బిరెడ్డి ల్లాంటి వాళ్ల అన్యాయం జరిగిందా లేక తహశిల్దారు నిర్వాకం వల్ల ఏమైనా జరిగిందా అనుకొంటూ కారున పక్కన ఆపి వాళ్లలో ఒక ముసలాయన్ను పిలిచి ఏమైనాది తాత ఇంత మంది ఉండారు. ఏమి జరిగినాది . ఏందా కాగితం సేతిలో అని అడిగాడు రుద్ర .

“ఎలక్షన్సులొస్తుండాయని కొత్త ఓటర్ల లిస్టు సేసినారంట గందా దాంట్లో సానా ఏళ్లబడి ఉండే మా పేర్లన్ని లేవని తెలిసినాది అందుకే అడిగేదానికి వచ్చినం. “ అన్నాడా ముసలాయన .

“ఇంత మంది ఓట్లు పోయినాయా ఎవరు తీసేసింద్రు .. “

“ఎవరు తీసింద్రో ఆపార్టీ తీసేసానిది అని ఈ పార్టీ ఈ పార్టీ తీసేసినాదని ఆ పార్టీ ...ఎవడు సేసింది తేల్లా. మా ఓట్లు మాతరం పోయినయి“ సరిగా నిలబడను కూడా శక్తిలేక ఆయాసపడ్తూ మాట్లాడుతున్న ఆ ముసలాయన్న చూసి,

“నీ ఓటు పోయినాదని అదే పనిగా వచ్చినవా ఓటు పోతే పోయినాది ఈ వయస్సులో దేనికంతా తపన పడుతుండావు “ అన్నాడు బికారి ఎగతాళిచేస్తున్నట్లు.

ముసలతను బికారి వంక కోపంగా చూస్తూ “ఓటు లేకపోతే సచ్చినట్టు కాదా .బతికుండాగా సచ్చినట్టుగా ఉండాలా ఏంది “అన్నాడు .

“ఓటంటే వీళ్లకు ఇంత పిచ్చా. అయినా ఇంకా ఎన్నికల నోటిఫికేషనే రాలేదు అప్పుడే కుయుక్తులు కుతంత్రాలు మొదలయ్యాయా . ఇంతకు మన నియోజక వర్గంలో ఎట్టా ఉండోదో రా “అన్నాడు పూజారి.

“అబ్బిరెడ్డిగాడు జైల్లో ఊచలు లెక్కబెట్టున్నాడుగా. “ అన్నాడు బికారి.

“లోపలున్నా ఆడ్నించి నాటకామాడిస్తాడు వోడు నాల్గాకులు ఎక్కవు సదివింటాడు గందా.కాకపోతే మనోళ్లు పట్టించుకొన్నరో లేదో .లేకవోళ్లకు తెలీదేమో . “

“పోయినాక ఓ పారి ఆఫీసుకాడికి పోయివస్తే బాగుంటది ఇషయం తెలుస్తాది. ఇంత మందిలో లోపలికిపోవడం అక్కడ నిర్మలను ఇబ్బంది పెట్టడం ఏం బాగుంటాది సార్ ఇంటికే పోదాం పదండి “అన్నాడు రుద్ర.మిగతా వాళ్లు సరే అనడంతో కారు వెనక్కి తిప్పుతుంటే ఓ ముసలామె చేతిలో కాగితాలతో అడ్డమొచ్చింది. బికారికి ఆమెతో మాట్లాడలనిపించింది.

“ హాయిగా ఇంట్లో పడుకోక ఈ అగసాట్లు దేనికీమెకు ఆమె ఓటుకోసరమేనా.. ఓటు కోసరం ఇంత తాపత్రయ పడుతుండారు. మనం ఓటు ఏసేదానికగూడా ఎప్పుడు పోలా “ అంటూ

కారు డోరు తీసి అవ్వా అవ్వా అంటూ పిలిచి . “ఏందవ్వా నీ ఓటు తీసేసినారాఏంది“ అడిగాడు బికారి. దానికి ఆ ముసలామె

బికారి వైపు ఎగాదిగా చూసి

“ఆ తీసేసింద్రు నాయనా ఆ ముదనష్టపు నాకొడకులు కొండపేటకాడ్నించి ఆటోలో వచ్చినా నీళ్లు దప్పికఅయితాండాయి యాడ దొరకలా నీకాడ నీళ్లుంటే కొద్దిగా ఇచ్చి పుణెం కట్టుకొబిడ్డా “అంది.

తన దగ్గరున్న నీళ్ల బాటిల్ అందించాడు. ఎంత దప్పిక కొన్నదో ఏమో సగం బాటిల్ పైన తాగేసింది. తాగి బాటిల్ తిరిగి ఇస్తుంటే “వద్దులే నీకాడ్నే ఉంచుకో గాని అయినా ఓటు లేదని ఇంత గస పోసుకొంటూ రాకపోతే ఏమైనాది ఇంటికాడ ఉండచ్చోగందా. “అన్నాడు బికారి.

“ఓటు లేకుంటే సచ్చినట్టే గందా... నాను బతికుండాగ ఓటెందుకు పోగొట్టుకోవాలా“ ముసలాయన మాటే ఆమె నోట విని ఆశ్చర్య పోయి చూస్తూంటే. మళ్లీ ఆమె అంది“ ఈ పారి ఓటుకు ఒక్కొక్కడు ఐదైలు ఇస్తారని అంటాండారు. .. ఓటు కార్డులేకపోతే యాడిస్తరు ఇయ్యరు. పదేలు పదైదు ఏలో పోతాది ఎవడినోట్లో కొట్టినట్టు“.

విస్తుపోయారు ముగ్గురు!

“ ఓర్నీ ఇదా అసలు కత..తెలీక జనాలేంది చాలా తాపత్రయ పడుతుండారు ఓటు కోసరం అనుకొంటిమి “.

“ఓటుకు డబ్బు ఎందుకిస్తుండారు దాన్తో ఎవడికి నష్టం అన్న ఆలోచన సేయడం లేదే. అప్పటి అవసరం తీరడం సూస్తుండారే గాని డబ్బిచ్చే వోడికి అమ్మడబోయి తమ బ్రతుకుల్న తాకట్టు పెట్టున్నామన్న తెలివి ఎవరికి ఉండటం లేదే. ఇలా వేలకు వేలుకు డబ్బులు తీసుకోని ఓటు వేసే వోళ్లు డబ్బులియ్యకపోతే ఉత్తచేతుల్తో మంచి సేస్తామంటే ఓటేస్తారా. నాయకులట్టే మారిపోయింద్రు ఇట్టా కోట్లు గుమ్మరించి మల్లా అంతకంతా సంపాదించేదానికే వోళ్లు కాచుకూర్చుంటారు పదివికోసం. “

మనషిలో దాని ఉనికే ఎక్కడుందో తెలియని మనసుకు దాసోహం అంటుంది శరీరం. సుఖమైన ,దుఖం మైనా ,కోపమైనా, తాపమైన, ఆలోచనైనా,ఆచరణైనా, చేయించేంది మనసు చేసేది శరీరం. కనపడని మనసుకు శరీరం బానిసై కష్టమైన సుఖమైనా తను పడుతూ అనుభవాన్ని మనసుకిస్తుంది. మనసు పెట్టే క్షోభతో కృశించిన శరీరంతో ఉన్న పరమేశంను చూడగానే రుద్ర చలించిపోయాడు. తనకు పరిచయమైనప్పటినుండి ఆ స్థితిలో పరమేశానికి ఎప్పుడు చూడలేదు. గడ్డం బాగా పెరిగిపోయింది. దాని చాటున ముఖం పీక్కపోయినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ముఖంలో కళ తప్పింది. లేని నవ్వును తెచ్చిపెట్టుకొంటూ పలకరించాడు రుద్రవాళ్లను. ఆరోగ్యం “ బాగాలేదా సార్?“ అడిగాడు రుద్ర. “బాగుంది రుద్ర బైటికి ఎక్కడికి పోవడంలేదు. గడ్డం గీసుకొవాడినికి కెందుకు బ్లేడు ఖర్చు అని గీసుకోలేదంతే “అన్నాడు నవ్వుతూ.

పరమేశంమిచ్చిన కూల్ డ్రింక్స్ తాగుతూనే రుద్ర కన్నా ముందుగా బికారి ఊర్లో జరిగిన వన్నీ నాన్ స్టాపుగా చెప్పేసాడు . నిర్లిప్తంగానే విన్నాడు పరమేశం. కేసు గురించి అడుగుతూ" కోదండమనే వోడు యాడుంటాడో ఎంత ఎతికిన కనపడలా కనపడింటే నాలుగు తన్నైనా వోడి సేత కోర్టులో నిజం సెప్పించేటోళ్లం.. "అన్నాడు పూజారి.

" ఆ అవసరం లేదు. కోదండం నా దగ్గరికి వచ్చాడు " అన్నాడు పరమేశం . ఆశ్చర్య పోయారు రుద్ర వాళ్లు.

"మీకాడికా ఎందుకు " రుద్ర ఆత్రంగా అడిగాడు మిగతా వాళ్లు కూడ అదే అత్రంగా చూసారు పరమేశం ఏం చెప్తాడో అని.

" చేసిన పనికి బాధ పడుతున్నాడు వాడు. తన చేత అబ్బిరెడ్డి మనష్యులు బలవంతపెట్టి భయపెట్టి అలా చేయించారని వాపోయాడు. అన్యాయంగా నన్ను ఇరికించినందుకు తను ఆర్థికంగా చాలా నష్టపోయాడని చెప్పాడు. వాడికి మిట్టమాని పల్లెలో భూమి ఉందట కాని వాడు స్తిరపడింది కడపలో. ఏదో వ్యాపారం చేసుకొనే వాడు.అబ్బిరెడ్డి భూమి పక్కనే వాడి భూమి ఉండటంతో అబ్బిరెడ్డి తను చెప్పిన పని చేయకపోతే వాడి భూమిని తన భూమిలో కలుపుకొంటానని బెదిరించే సరికే బెదిరిపోయాడు వాడితో గొడవెందుకని. అంతే కాని తను ఉద్దేశ్వపూర్వకంగా చేయలేదని చెప్పాడు. ఇప్పుడు ఆ భూమిని అమ్మేసాడట ఇక ఆ ఊరికి తనకు ఏ సంబంధం లేదని అబ్బిరెడ్డి తననేమి చేయలేడని కోర్టులో నిజం చెప్తానని వచ్చాడు. "

"మంచి వాళ్లకు మంచేజరుగుతాది సార్ లేకపోతే తప్పుసేసినాని వోడు మిమ్మల్ని ఎతుక్కొంటూ రావడమేంది . "అని రుద్ర అంటే " అయితే తొరలోనే మీ మీద కేసు కొట్టేస్తరన్న మాట. అబ్బిరెడ్డికి కోర్టు శిక్ష ఏస్తాదా" అన్నాడు బికారి.

"అబ్బిరెడ్డికి శిక్షా ? కోదండం దగ్గర అబ్బిరెడ్డి చెప్పడంతో చేసానని చెప్పేందుకు ఏలాంటి ఆధారాలు లేవు. అబ్బిరెడ్డికి ఏమి కాదు. సాక్ష్యాలుంటేనే వాడ్ని ఏమి చేయలేరు . ఇదెంత. "

"పోనీలే అబ్బిరెడ్డికి ఏమి కాకపోయినా మీకు ఉజ్జోగము తిరిగి వస్తాది మీద పడ్డ చెడ్డ పేరు పోతాది. "

"లేదు.నేనే వాడ్ని సాక్ష్యం చెప్పవద్దన్నాను. "

"ఎందుకు "ఆశ్చర్యపోతూ ఒకేసారి అడిగారు ముగ్గురు.

"ఒక వేళ వాడు కోర్టులో తన తప్పు ఒప్పుకొంటే వాడికే శిక్ష పడుతుంది. డిపార్టుమెంటును కోర్టును తప్పుదారి పట్టించాడని. అనవసరంగా వాడెందుకు శిక్ష అనుభవించాలి. అందుకే వాడు ఏమి చెప్పనవసరం లేదన్నాను. కేసు తెగడం ఆలస్యమైనా త్వరలో సస్పెన్సును ఎత్తివేస్తారు. ఉద్యోగం వస్తుంది. అందువల్ల నాకు జరిగే నష్టమేముంది . "

"అదిగాదు సార్ వోడు కోర్టులోన తను సేసిన తప్పు ఒప్పుకొంటే మీ కేసు తొరగా తేలిపోతాది. మీపైన పడ్డ సెడ్డ పేరు పోతాది గందా. "

పరమేశం నవ్వుతూ “ఆరోజులు పోయాయి రుద్ర. వాడు నిజం చెప్పినా ఎవరు నమ్మరు కోర్టుతో సహా ఎందుకంటే వాడికి ఏదో ఆశ చూపించో బెదిరించో వాడి చేత అలా చెప్పించారనుకొంటారు. రేపు కేసులో గెలిచినా అదే పరిస్థితి అనుకో . ఎవరు నిజం చెప్తున్నారో ఎవరు అబద్దం చెప్తున్నారో అర్థం చేసుకోలేక తప్పు చేసిన వాడు చేయని వాడు ఒకే శిక్ష అనుభవిస్తున్నారు. ఈ రోజుల్లో తప్పు చేయని వాళ్లు లేరని లోకం ఉద్దేశ్యం మచ్చ ఏలాగు పడింది. దాన్ని మనస్సాక్షికి వదిలేయడం తప్ప ఏమి చేయలేం. . అంత దానికి అనవసరంగా వాడు శిక్ష అనుభవించడమెందుకు .వాడు ఉద్దేశ్య పూర్వకంగా చేసి ఉంటే శిక్ష అనుభవించడంలో అర్థముంది. తన ఆస్తిని కాపాడు కోవాడానికి వాడలా చేసాడంతేగా. “

“అవును మీరు బాధ పడినా ఎదుట వాళ్లు బాధ పడకూడదు. మిమ్మల్ని మీ పేరును నాశనం చేసి. కుటుంబాన్ని అప్రతిష్ట పాలుచేసిన వాడి మీద మీకు ఇంకా జాలా? ఎప్పుడు వచ్చాడా బాస్టర్డ్? “ నిప్పులు కక్కుతూ ప్రశ్నిస్తున్న నిర్మలను చూచి అప్రయత్నంగా లేచి నిల్చున్నారు రుద్రతో సహా మిగతా వాళ్లు. మాటల్లో పడి ఆమె వచ్చింది గమనించలేదు ఎవరు. పరమేశం కూడా ఆశ్చర్యపోతూ“ వాడి సంగతి సరేలే ఎవరు వచ్చారో చూడు“ అన్నాడు పరమేశం. రుద్ర ఉద్విగ్నంగా నిర్మల వైపుచూసాడు.. తను వచ్చానని చెప్పగానే ఆమెకు వచ్చిన కోపం పోతుంది. ఆమె తన వైపు సంతోషంగా చూస్తుంది. ఆ చూపులకు తట్టుకొంటూ తడబడకుండా. “ ఎలా ఉన్నారు? మీ ట్రైనింగ్ ఎలా ఉంది? మీరు ఆర్డోవోగా ఎప్పుడు జాయినవుతారు? “ అని అడగాలి అనుకొన్నాడు. కాని రుద్ర ఊహించినట్లు అలా ఏమి జరగలేదు. నిర్మల తలతిప్పి రుద్ర వైపు చూడను కూడా చూడలేదు.. పరమేశం మాటలు పట్టించుకోకుండా ,

“వాడు వచ్చింది నాకు ఫోన్ చేసి చెప్పిండాల్సింది. వాడి వల్ల మీరు మీతో పాటు మేము ఎంత క్షోభ అనుభవిస్తున్నాం. అలాంటి వాడిపైన ఇంకా సానుభూతా!? ఈ లోకంలో మరీ అంత మంచి తనం పనికి రాదునాన్న లోకంతో పాటు మనం మారాలి. మారక పోతే బతకలేం. ఒకరికోసం మనం శిక్ష అనుభవించడమేమిటి? మనం మునిగిపోతు ఎదుట వాడిని కాపాడాలనుకోవడం ఎంత వరకు సబబు. పిచ్చికాకపోతే “.

“అది గాదు నిర్మల“

“నన్ను కన్విన్స్ చేయాలనుకోవద్దు. మీ నీతి నిజాయితి మంచి తనంతో విసిగిపోయాను.. “ అంటూ చేతిలో బ్యాగు విసురుగా పక్కనున్న కుర్చిలో వేసి లోపలికి వెళ్లిపోయింది నిర్మల .

వాతవరణం విస్తుపోయింది అక్కడున్న మనష్యులతో పాటు. భయంకరమైన నిశబ్దం మధ్య భయపడుతునే టిక్ టిక్ మని గోడ గడియారం చేస్తున్న శబ్దం తప్ప మరే శబ్దం లేదు అక్కడ కొద్దిసేపు.

పరమేశంకు మొదటి సారిగా కూతురు మాటల్లో తేడాతో పాటు ఆమె కోపం , విసుగు చూసి ఖిన్నుడయ్యాడు. తనతో అలా నిర్వివివాదంగా విభేదిస్తున్నందుకు, తను నేర్పిన సంస్కారం ...వివేకం మరిచిపోయి ఇంటికి వచ్చిన తెలిసిన వాళ్లను అలా పలకరించకుండా వెళ్తున్నందుకు. నిశ్చేష్టుడయ్యాడు. కలవరపడిపోయాడు. మాటలురాలేదు. “

లోకంతో పాటు మారాలా, తన నీతి ,నిజాయితీ ,మంచితనంతో విసిగిపోతుందా.... ఆ బాధ ...ఆ భావం , ఆ అలోచన ఆమె మనసులో ఎప్పడ్నుంచో రగుల్తునే ఉందా . నివురు గప్పిన నిప్పులా ఉండి ఇప్పుడు బైట పడిందా. చిన్నప్పట్నుండి నీతి నిజాయితీ అంటూ పెరిగిన ఆమెలో ఆ బావాలు ఎలా పోయాయి. కొత్తగా మెలకెత్తుతున్న ఆలోచన్లోతో తను గాడి తప్పుతుందా . “ రుద్ర వాళ్లు అక్కడున్నారన్న విషయం కూడా మరిచిపోయాడు పరమేశం.

రుద్రకూడా మాన్పడిపోయాడు. ఆమె మాటలు ఊహకందలేదు. తనను నిర్లక్ష్యం చేసింది అన్నదానికన్నా ఆమెలో వచ్చిన మార్పుకు బాధ పడ్డాడు. రుద్ర మౌనంగా ఉన్నా పూజారి బికారి అసహనంగా అలాగే నిల్చుండిపోయారు కొద్దిసేపు. ఇక అక్కడ ఉండాలనిపించలేదు వాళ్లకు.

“ వెళ్తాం పదరా రుద్ర “ అన్నాడు పూజారి. కదలకుండా నిల్చుండిపోయిన రుద్ర భుజంమీద చేయివేస్తూ “మేము వెళ్లొస్తాం సార్ “అన్నాడు బికారి. ఆ మాటతో ఇహలోకానికి వచ్చిన పరమేశం తెచ్చిపెట్టుకొన్న చిరునవ్వు కూడా చిన్న బోతుంటే ,

“భోంచేసి వెళ్తురులేండి “అన్నాడు మ్లానమైన ముఖంతో నిర్వేదంగా .

“లేదు సార్ వెళ్తాం ఇంకోసారి వచ్చినప్పుడు భోంచేస్తాం. “ మొదటి సారి తల దించుకొన్నాడు పరమేశం. అతని కళ్లద్దాల్లోంచి కన్నీటి తడి స్పష్టంగా కనపడుతుంటే అక్కడ నిలబడలేక బైటికి నడిచాడు రుద్ర. అతనితో పాటు మిగతా ఇద్దరు నడిచారు.

కారు ఎక్కినంత వరకు నిశబ్దమే ఉంది వాళ్ల మధ్య. కారు ఎక్కిన తర్వాత “ ఉద్యోగం ఎంతటోళ్లైనా మార్చేస్తాది. తను ఆర్డివో అవబోతుండాది మనల్లాంటోళ్లను పలకరిస్తే నామోషినుకొందేమో . అయినా అది రుద్ర ఉజ్జోగం కన్నా పెద్ద ఉజ్జోగమా ఏంది “ అన్నాడు బికారి కోపంగా .

“అయినా ఆమె మాటాడితే ఎంత మాటాడకపోతే ఎంత . పాపం పరమేశంసారు బాధ పడ్తాండాడు. “ అన్నాడు పూజారి.

రుద్రకు వాళ్ల మాటలు పట్టించుకోలేదు. “ మొదట్లో తాము ఆమెను కలిసి నప్పుడు ఉన్న తీరుకు ఇప్పటికి చాలా తేడా కనిపిస్తాండాది. ఎందుకంతా కోప్పడ్తాండాది.? తమ వల్లే తన తండ్రికి అట్టా జరిగిందనుకొంటుందా అందుకే తమతో మాటాడకుండా పోయినాదా. ఆమె కోదండం మీద కోప్పడటం సహజమే కాని కాలంతో పాటు మారాలన్న ఆమె మాటల్తో పాటు పరమేశాన్ని పట్టుకొని పిచ్చి అనడం ....తండ్రి నీతి నిజాయితీకి మంచి తనానికి విసిగిపోయినా అనడంలో ఎనక ఆమె మనసులో ఏదో ఉందనిపించింది. ఇంకేదో జరగబోతుండాది .. పాపం పరమేశం కన్నీటి తడి చూస్తుంటే అర్ధమవుతుంది అతడెంత క్షోభ పడుతున్నాడో “

ఒకే ఒక మాటతో మారిన ఆమె నైజం స్పష్టంగా కనిపిస్తుంటే దారులు వేరై ఆమె తనకు దూరమైపోతుందన్న బాధ మనసును కలచివేయసాగింది. ఏదో విలువైంది కోల్పోయి అంతా శూన్యంమైనట్లు కూర్చుండి పోయాడు రుద్ర.

❦❦❦

రుద్ర వాళ్లు పోగానే కొద్ది సేపు మౌనంగా కూర్చున్న పరమేశం ఆతర్వాత మౌనంగా ఉండలేక పోయాడు. నిర్మలను పిలిచి అంత దూరం నుండి వచ్చిన రుద్రవాళ్లను ఎందుకలా కనీసం పలకరించేందుకు ఏమైంది నీకు నిలదీసాడు.

“నాకు మాట్లాడలనిపించలేదు.అసలు నీకు ఇలా కావడానికి కారణం వాళ్లు . వాళ్లు అబ్బిరెడ్డితో విభేదించకపోయి ఉంటే అబ్బిరెడ్డి నీ జోలికి వచ్చేవాడు కాదు. అతని పనులు నచ్చకపోతే నువ్వు సెలవులో వెళ్లేవాడివి మరోచోటికి ఇంత అవమా నం జరిగి ఉండేది కాదు. “తనను తను సమర్ధించుకొంది నిర్మల.

“నీ బావాలు మారిపోతున్నాయి నిర్మల. ఒకప్పుడు ఎంతో మెచ్చుకొన్న వాళ్లను ఇప్పుడు తీసి పారేస్తున్నావ్. అధికారంతో మన బావాలు మారిపోకూడదు. అధికారంతో నువ్వు ఎంతో మందికి మంచి చేస్తావని మంచి పేరు తెచ్చుకోవాలన్న నీ ఆశయానికి ఏమైంది. ఎందుకిలా ఉన్నట్లుండి మార్పు వచ్చింది. నువ్వు నా బెయిల్ కోసం ఎమ్మెల్యే దగ్గరకి పోయి తప్పుచేసావు. “

“లేదు నాన్న నేను సరైన పనిచేశాను. నీతి నిజాయితి నిన్ను జైలు పాలు చేస్తే దాని మీద నాకు విసుగేసింది బతికేందుకు పదిమందిలో గుర్తింపు తెచ్చుకొనేందుకు ఆ దారి మంచిది కాదని నేను నా దారి మార్చుకొన్నాను. ఆ ఎమ్మెల్యే ద్వారానే నాకు కర్నూలు ఆర్డివో పోస్టింగ్ అవుతుంది నా ట్రైనింగ్ పూర్తికాగానే “

పరమేశం పిచ్చిపట్టిన వాడిలా అయ్యాడు. “ ఏం చేస్తున్నావో నీకు అర్థమవుతుందా. ఓ ఉద్యోగి రెకమెండేషన్ కోసం రాజకీయనాయకుడి వెళ్తున్నాడంటే, అతను తన స్వేచ్చ కోల్పోయి బానిస బ్రతుకు బ్రతికేందుకు సిద్దపడినట్లే. నాయకుడు ఆడమన్నట్టు ఆడాలి చేయమన్నట్లు చేయాలి. నువ్వు ఎన్ని చట్ట వ్యతిరేఖమైన పనులుచేసిన వాళ్లను సంతృప్తి పరచలేవు. ఏ ఒక్కటి చేయకపోయినా అవమానపడాల్సి వస్తుంది. ఆ ఊబిల్లోంచి నువ్వు బైట పడలేవు. ఉన్నతమైన ఉద్యోగం నీది . నాది చిన్న ఉద్యోగం పై అధికారులు ఎక్కువ కాని నీకా సమస్యలేదు. బాధ్యతగా పనిచేసి ప్రజలకు సేవచేయాలి మంచి పేరు తెచ్చుకోవాలే కాని అందుకు విరుద్ధంగా నీ స్వార్థంకోసం రాజకీయ నాయకులు తలుపు తట్టడం మంచిది కాదమ్మ నా మాట విను నీ పంథా మార్చుకో.“ అన్నాడు ఆవేశంగా.

“ ఒకే ఒక సంఘటన నా మానసికి స్థితిని మార్చేసింది నాన్నా. అయినా మీ ఇరవై ఏండ్ల నీతి నిజాయితీకి మీ డిపార్టుమెంటు ఏమిచ్చింది నాన్నా? మీకు ఓ మెడలిచ్చిందా? ఉత్తమ ఉద్యోగి అని ఏనాడైన సన్మానించిందా? లేదే . అయినా ఆ సన్మానాలు మెడల్స్ కూడా రెకమెండేషన్ ఉన్న వాళ్లకే వస్తుంటాయని నీకు తెలియంది కాదు. అలాంటప్పుడు నీతి నిజాయితీ అంటూ అని వాటిని పట్టుకొని ప్రాకులాడటం దేనికి ? ఏం సాధించడానికి ? “అని ఎదురు ప్రశ్నించింది నిర్మల.

“నీతి నిజాయితీగా ఉండటం మన్నది ఏదో సాధించామని చెప్పడానికి కాదు. ఎవరి మెప్పుకొసమో కాని . ఏ మెడల్ కోసమో కాదు. అది ఓ బాధ్యత . తన పని పట్ల తను చేస్తున్న ఉద్యోగం పట్ల ఉన్న నిబద్ధత. గౌరవం. దానికోసం . ఒక పక్క ఆశలు ప్రలోభ పెడ్తున్నా మరో పక్క బెదిరింపులు భయపెడుతున్నా .వాటిని తట్టుకొని నిలబడి పదిమందికి మంచి చేయడంలో ఓ తృప్తి ఉంది. నా పని నా బాధ్యత సరిగా చేసుకొని పోతున్నా అనే అనందముంది. “అన్నాడు పరమేశం.

“ ఎందుకు పనికి రాని ఆ ఆనందం , తృప్తి ,ఎవరికోసం. మిమ్మల్ని లంచగొండిగా ముద్ర వేసి సస్పెండు చేసినప్పుడు ఉపయోగ పడ్డాయా. ఇంత జరిగినా ఇంకా మీరు నీతి నిజాయితి అంటున్నారు. మీకు వాటి మీద నమ్మకముండ వచ్చు నాకు లేదు. పిల్లప్పటినుండి చూస్తునే ఉన్నా . బీదరికంతో మనం పడే పాట్లు రాజకీయనాయకుల్తో మీకు జరిగే అవమానాలు, మీకు జరిగే బదిలీలు . ఎప్పుడైనా ఒక్క సారైనా మీ నిజాయితీకి ఫలితం దక్కుతుందనే అనుకొంటునే ఉన్నా. అలా ఒక్క సారి జరిగినా నేను మారే దాన్నికాదు. మారాలని అనిపించేదికాదు. ఇన్ని సంవత్సరాలనిజాయితీకి మీకు దక్కిన ఫలితం చూసాక నేనలా ఉండకూడదనిపించింది. దాని వల్ల ఫలితం లేదనిపించింది. అందుకే ఎమ్మెల్యేతో పనులు చేయించుకోవలనుకొన్నాను. నన్ను ఆర్డివో వేయించినందుకు కొన్ని చట్ట విరుద్దంగా చేయాల్సి వచ్చినా చేయాలనుకొన్నాను. మీలాగా ఆశలకు ప్రలోభపడకుండా బెదిరింపులకు భయపడతూ ఉద్యోగం చేయాలనిలేదు. లోకం తీరుకు విరుద్దంగా పని చేయడం వల్ల వచ్చే నష్టం కన్నా దానికి అనుకూలంగా నడుచుకోవడం వల్ల లాభాన్నే నేను కోరుకొంటున్నా. మీరు చూస్తుండండి మీరు మీ సర్విసులో సంపాదించలేని ఊహించలేనంతా ఒక సంవత్సరంలోనే సంపాదిస్తా. అంతే కాదు సంవత్సరానికి ఒక ఆవార్డు తీసుకొంటా“ అంటూ తన నిర్ణయాన్ని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పింది.

“నీ ఆలోచనలు తప్పు.. నీకు ఈ అవకాశం వచ్చింది ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవచేయాలని అంతే కాని నీ స్వార్ధంకోసం దాన్ని వ్యాపారంగా ఉపయోగించుకోమని కాదు. రాజకీయనాయకులు ఈ రోజు అధికారంలో ఉన్న వాడు రేపుండటం లేదు. అలాంటి వాళ్లు చెప్పినట్లు అన్ని పనులుచేస్తూ, ఆశలకు అర్రులు చాస్తు పోతే నీ గొయ్యి నువ్వు తొవ్వుకొన్నట్లే .. నీతి నిజాయితీగా ఉండటం వల్ల జల్సాగా జీవించేందుకు డబ్బులు రాకపోవచ్చు. భయమనేది ఉండదు. తప్పుచేస్తే అది నిన్ను జీవితాంతం వెంటాడుతునే ఉంటుంది. “

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS